కళలకు నిలయం క్షీరారామం


గతేడాది ఉత్తమ ప్రదర్శన బహుమతి పొందిన 'రాత' నాటిక


ద్వితీయ బహుమతి పొందిన 'ఇంద్ర ప్రస్థానం'


తృతీయ బహుమతి పొందిన 'స్వప్నం రాల్చిన అమృతం'

రేపటి నుంచి పాలకొల్లులో జాతీయ స్థాయి నాటికల పోటీలు

పాలకొల్లు సెంట్రల్: సమాజాన్ని చైతన్యపరిచే ఏకైక సాధనం నాటకం. నాటక రంగానికి పుట్టినిల్లు పాలకొల్లు. ఎందరో కళాకారులకు, కళాభిమానులకు నిలయం ఈ క్షీరారామం. ఈ నెల 15వ తేదీ నుంచి 16వ జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహించనున్నారు. మహాత్మా మిత్ర బృందం, మిత్ర బృందం, సంగీత నాటక అకాడమీ, దాసరి కల్చరల్ అకాడమీ, క్షీరపురి నాటక అకాడమీ, లలిత కళాంజలి నాటక అకాడమీల స్ఫూర్తితో గత 61 ఏళ్లుగా కళాకారులను ప్రోత్సహిస్తూ జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తున్నారు. పాలకొల్లు కళాపరిషత్ పేరున గత 15 ఏళ్లుగా కళాప్రియులు చలం స్మారక నాటకోత్సవం, అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, ఈవీవీ సత్యనారాయణ, వంగా అప్పారావు, దాసరి నారాయణరావు, కోడి రామకృష్ణ, కలిదిండి రఘురామరాజు, విన్నకోట వెంకటేశ్వరరావులను స్మరించుకుంటూ ఒకో ఏడాది ఒకరి పేరున జాతీయ స్థాయి స్మారక నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు.

రేపటి నుంచి పోటీలు

పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో మార్చి 15, 16, 17 తేదీల్లో 16వ జాతీయ స్థాయి నాటిక పోటీలు స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద అడబాల థియేటర్ పక్కన ఉన్న ప్రాంగణంలో నిర్వహించనున్నారు. 15వ తేదీ శనివారం రాత్రి 8 గంటల నుంచి అరవింద్ ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి, ఉషోదయ కళానికేతన్ కత్రపాడు వారి కిడ్నాప్, ఆదివారం మిత్ర క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఇది రహదారి కాదు, చైతన్య కళాస్రవంతి, విశాఖపట్నం వారి (అ) సత్యం, మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ చిలకలూరి పేట వారి మా ఇంట్లో మహాభారతం, సోమవారం అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం, పండూ క్రియేషన్స్ ఒంగోలు వారి పక్కింటి మొగుడు, నటీనట సంక్షేమ సమాఖ్య పాలకొల్లు వారి అనూహ్యం నాటికలు ప్రదర్శించనున్నారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవం ఉంటుంది.

నలుదిశలా పాలకొల్లు కీర్తి ప్రతిష్ఠలు



నాటి పెద్దలు ఇచ్చిన స్ఫూర్తితో కళాపరిషత్ నిర్వహిస్తున్నాం. నేటికీ కళలను ప్రోత్సహించే కళాభిమానులు ఉండడం మా నిర్వహణకు ఒక ఉత్సాహం. నాటిక కళాపరిషత్‌ల ద్వారా పాలకొల్లు నుంచి ఎంతో మంది కళాకారులు తమ ప్రతిభను చాటుకుని అగ్ర దర్శకులు, నటులుగా గుర్తింపు పొందడమే కాకుండా పాలకొల్లు కీర్తిప్రతిష్ఠలను ప్రపంచం నలుదిశలా పరిచయం చేయడం గమనార్హం.

– కేవీ కృష్ణవర్మ, అధ్యక్షుడు, పాలకొల్లు కళాపరిషత్, పాలకొల్లు

క్షీరపురి రుణం తీర్చుకోలేనిది



తాను ప్రదర్శించిన అనేక నాటికలకు బహుమతులు అందుకోవడం పాలకొల్లు బిడ్డగా ఎంతో గర్వపడుతున్నాను. ఇటీవల చత్తీస్‌గడ్ బిలాయలో జరిగిన జాతీయ స్థాయి నాటికల పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ గుర్తింపు అంతా పాలకొల్లు కళాకారునిగా వచ్చిందే. మా లాంటి ఎందరో కళాకారులను నిలయమైన క్షీరపురి రుణం తీర్చుకోలేనిది.

– మానాపురం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, పాలకొల్లు కళాపరిషత్

గ్రంథాలయానికి సొంత భవనం లేనట్టే!

- నిలిచిన నిర్మాణ పనులు
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.1.18 కోట్లు మంజూరు
- కాటన్ పార్కు వద్ద చేపట్టిన నిర్మాణ పనులు


కాటన్ పార్కు వద్ద నిలిచిపోయిన గ్రంథాలయ నిర్మాణ పనులు

నరసాపురం: నరసాపురం పట్టణంలో కాటన్‌పార్కు వద్ద చేపట్టిన గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులను కూటమి సర్కార్ నిలిపేసింది. దీంతో నరసాపురం శాఖా గ్రంథాలయానికి కొత్త భవనం లేనట్టేననే వాదనలు వినిపిస్తున్నాయి. 2023 జనవరిలో గ్రంథాలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ద్వారా రూ.1.28 కోట్లు మంజూరు చేసింది. అదే ఏడాది ఏప్రియల్ నెలలో పనులు ప్రారంభించింది. నాటి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచన మేరకు రైల్వే స్టేషన్ రోడ్డులోని కాటన్ పార్కు వద్ద 25 సెంట్ల మున్సిపల్ స్థలాన్ని గ్రంథాలయం కోసం కేటాయించారు. దీంతో ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న నరసాపురం గ్రంథాలయానికి సొంత భవనం సమకూరనుందని అందరూ భావించారు. ప్రభుత్వం మారడంతో పనులు అర్ధాంతంగా నిలపుదల చేశారు.

అద్దె భవనమే దిక్కు

నరసాపురం శాఖా గ్రంథాలయానికి 70 ఏళ్ల చరిత్ర ఉంది. 1954లో నరసాపురంలో గ్రంథాలయాన్ని స్థాపించారు. ప్రస్తుతం గ్రేడ్–1 గ్రంథాలయంగా కొనసాగుతోంది. ఇప్పటికీ ఈ గ్రంథాలయానికి ప్రతిరోజూ 200 మంది వరకు చదువరులు వస్తున్నారు. అయితే ఇక్కడ గ్రంథాలయానికి భవనమే అసలు సమస్య. పూర్వం నుంచి గ్రంథాలయం అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కొనసాగుతోంది. ఇరుకు గదుల్లో, ఆరుబయట పుస్తకాలు చదవాల్సిన పరిస్థితి ఉంది.

"అభివృద్ధికి అడ్డంకులు



నరసాపురం అభివృద్ధికి గత ప్రభుత్వ మంజూరు చేసి, మొదలు పెట్టిన పనులు కూడా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిలిచిపోతున్నాయి. ఇది దారుణం. నరసాపురం లైబ్రరీ పురాతనమైంది. ఇప్పటి వరకు సొంత భవనం లేకపోవడం బాధాకరం. లైబ్రరీ భవనానికి రైల్వే స్టేషన్ రోడ్డులో విలువైన మున్సిపాలిటీ స్థలాన్ని కేటాయించాం. అప్పటి మా ఎమ్మెల్యే ముదునూరి నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉంటే ఈ వేసవిలో కొత్తభవనంలో లైబ్రరీ ఉండేది.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

నేడు కంటి వైద్య శిబిరం

యలమంచిలి: ఇలపకుర్రు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 నంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సర్పంచ్ కొండేటి జీవరత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొల్లు నేత్ర కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని, ఇలపకుర్రు, పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్షీరారామంలో చండీహోమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని చండీహోమం నిర్వహించారు. భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో సుమారు 15 మంది దంపతులు పూజలు చేశారు. భక్తులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, జాకెట్ ముక్కలు పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

పెనుగొండ: సిద్ధాంతం భద్రకాళీ సమేత వీరభద్ర, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పూజ్యం దుర్గా సత్యనారాయణ మూర్తి వేదమంత్రోచ్చారణలతో ఆచంట రాము నాగమణి దంపతులు, ఆచంట చిన్నకస్తూరి, గుద్దటి దత్తాత్రేయకరుణ దంపతులు పూజలు చేశారు. శుక్రవారం ఉదయం స్వామి వార్ల విగ్రహాలతో గ్రామోత్సవం, శనివారం ఉదయం 10.29 గంటలకు విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ అనంతరం భారీ అన్నసమారాధన ఉంటుందని ఆచంట రాము తెలిపారు.

నేడు పట్టణ ప్రణాళికాభివృద్ధిపై సదస్సు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ పరిశర ప్రాంతాల సమగ్ర ప్రణాళికాభివృద్ధికి జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ (బృహత్తర ప్రణాళిక) తయారు చేయనున్నట్టు మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి తెలిపారు. ఈ ప్లాన్‌ను రాబోయే 25 ఏళ్ల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఐటీపీఐ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా), ఏపీ రీజన్ వారు తయారు చేయనున్నట్టు చెప్పారు. దీనిపై 14వ తేదీన సాయంత్రం 4 గంటలకు పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్ హాలులో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. అధికారులు, ప్రజలు పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

'స్వర్ణాంధ్ర'కు పరిశోధనా కేంద్రం


రీసెర్చ్ సెంటర్ మంజూరు పత్రాలను చూపుతున్న యాజమాన్యం, తదితరులు

నరసాపురం రూరల్: రాష్ట్రంలో పేరెన్నికగన్న స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలకు 2025–26, 2026–27 విద్యాసంవత్సరాలకు జేఎన్‌టీయూ కాకినాడ పరిశోధనా కేంద్రం మంజూరయినట్టు యాజమాన్యం తెలిపింది. గురువారం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ మాట్లాడుతూ పరిశోధనలు చేసే విద్యార్థులు, అధ్యాపకులకు ఈ పరిశోధనా కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సెంటర్ రావడం సువర్ణావకాశమని, మైలు రాయివంటిదని కళాశాల కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు సురేష్‌కుమార్, పండరీనాథ్, వైస్ ప్రిన్సిపాల్ గోపిచంద్, పాలిటెక్నిక్‌క్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం కిరణ్మయి, సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ విభాగ అధిపతులు పి.శ్రీనివాసులు, పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, ఫ్రాన్సిస్ లూథర్ కింగ్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు పశువులకు టీకాలు


మొగల్తూరులో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నరసాపురం రూరల్: పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు జవహర్ హుస్సేన్ అన్నారు. గురువారం నరసాపురం, మొగల్తూరు మండలాల్లో పశువులకు టీకా కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. రాజుగారితోట గ్రామంలో 89, మోడి, వారతిప్ప గ్రామాల్లో 143 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఏడీఏ సుధాకర్, పశువైద్యులు, నీలిమ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

202 పశువులకు టీకాలు

యలమంచిలి: మండలంలోని మేడపాడులో గురువారం నిర్వహించిన శిబిరంలో పశు వైద్య సిబ్బంది 43 ఆవులు, 159 గేదెలకు గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా టీకాలు వేశారని మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా వేస్తున్న ఈ టీకాను రైతులంతా తమ పశువులకు వేయించాలన్నారు. దొడ్డిపట్ల, బూరుగుపల్లి గ్రామాల్లో శుక్రవారం పశువులకు టీకాలు వేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకురాలు గోనిపాటి గంగా భవాని పాల్గొన్నారు.

నిరుద్యోగులకు బ్యాంకు రుణాలు

పాలకొల్లు సెంట్రల్: కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని నిరుద్యోగులకు సబ్సిడీపై బ్యాంకు రుణాలు మంజూరు చేయనున్నట్టు మునిసిపల్ కమిషనర్ బి.వియజసారధి తెలిపారు. బీసీ, కాపు కార్పొరేషన్లు, అగ్ర కులాల్లోని ఆర్థికంగా వెనుకబడిన (ఈడబ్ల్యూఎస్) వారి జీవనోపాధి పెంపునకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా బ్యాంక్ రుణాలు మంజూరు చేయనుందని, 18 నుంచి 50 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగులు గ్రామ సచివాలయాల్లో లేదా ఆన్‌లైన్‌లో ఈనెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వశిష్ట గోదావరికి హారతులు


సిద్ధాంతంలో గోదావరి మాతకు పంచ హారతులు ఇస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతం వశిష్ట గోదావరి వద్ద గురువారం రాత్రి పౌర్ణమి సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జయవరపు కృష్ణ హర్ష, రోహిత దంపతులచే గోదావరి మాతకు పంచ హారతులు కార్యక్రమం కలగబద్రుడు స్వామి బ్రాహ్మణత్వంతో కనుల పండువగా నిర్వహించారు. నదీమతల్లులను ఆరాధించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో చావలి ట్రస్ట్ ఫౌండర్ కంభంపాటి సుబ్రహ్మణ్యం, ఆనంద గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అన్నదమ్ములకు వెలుగు చూపిన విశ్వమానవ వేదిక


అన్నదమ్ములకు ఆహార ప్యాకెట్లను అందిస్తున్న దృశ్యం


నాగ వెంకటేష్ చికిత్సకు ముందు, తరువాత పరిస్థితి

పాలకొల్లు సెంట్రల్: మానసిక వ్యాధితో రోడ్డుపై తిరుగుతున్న స్థానిక రామారావు పేటకు చెందిన అంబళ్ల నాగ వెంకటేష్, జగదీష్ అన్నదమ్ములకు పట్టణంలోని విశ్వమానవ వేదిక సేవా సంస్థ వెలుగు చూపింది. ఆ సంస్థ నిర్వాహకుడు మల్లుల సురేష్ ఏడాది క్రితం భీమవరంలో ఉన్న మనోబంధు ఫౌండేషన్ భూపతిరాజు రామకృష్ణంరాజు సహకారంతో ఒకరిని విశాఖపట్నం, మరొకరిని తమిళనాడుకు చికిత్స నిమిత్తం తరలించారు. వారి మానశిక స్థితి 80 శాతం మెరుగుపడడంతో రామారావు పేటకు తీసుకొచ్చారు. వారి తల్లి కూడా మానశికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరు పూర్తి ఆరోగ్యంగా కోలుకునే వరకు విశ్వమానవ వేదిక నుంచి ప్రతిరోజు ఇంటికి భోజనం, మెడిసిన్ పంపిస్తామని సురేష్ తెలిపారు. వారికి గురువారం బుద్దరాజు, నడపన జగపతి చేతులు మీదుగా భోజనం ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో గమిడి హేమంత్, కొప్పిసెడి కళ్యాణ్ కుమార్, మల్లేడి దేవిరాజ్, డాక్టర్ మల్లుల జ్ఞానేశ్వరి, విశ్వమానవ వేదిక సభ్యులు పాల్గొన్నారు. రామారావు పేట వాసులు, యువత అందరూ విశ్వమానవ వేదిక సేవలను కొనియాడారు.

పంట కాలువలో జంతు కళేబరాలు


పంట కాలువలో కొట్టుకొస్తున్న జంతు కళేబరాలు

భీమవరం అర్బన్: మండలంలోని కాళీపట్నం ఛానల్‌లో జంతు, కోళ్ల కళేబరాలు కొట్టుకురావడంతో దిగువ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఛానల్ భీమవరం పట్టణంనుంచి యనమదు ర్రు, దిరుసుమర్రు, రామాయణపురం, నాగిడిపాలెం గ్రామాల మీదుగా మొగల్తూరు మండలంలోని కాళీపట్నం పంచాయతీలోని పలు గ్రామాలకు వెళుతుంది. ఛానల్‌ను ఆనుకుని వేలాది వరి, చేపలు, రొయ్యలు చెరువులకు, గ్రామాల్లోని రక్షిత మంచి నీటి చెరువులకు సాగు, తాగునీరు అందిస్తుంది. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో మృతి చెందిన కోళ్లు, జంతు కళేబరాలు కొట్టుకొస్తున్నాయి. దీంతో ఛానల్ పరివాహక గ్రామస్తులు ఆ నీటిని తాగితే వ్యాధులు ప్రబలుతాయేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కాలువలో కోళ్లు, జంతు కళేబరాలు, చెత్త వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మావూరమ్మ ముఖద్వారానికి శంకుస్థాపన


ముఖద్వారానికి శంకుస్థాపన చేస్తున్న గౌరునాయుడు దంపతులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బంగారు వారి చెరువు గట్టున కొలువైన మావూరమ్మ ఆలయం ప్రాంతం రావిచెట్టు సెంటర్‌లో ముఖద్వారం నిర్మిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు శంకరావు శ్రీనివాసు తెలిపారు. గురువారం మునిసిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ దంపతులు కర్నేన గౌరునాయుడు, రోజారమణిలు శంకుస్థాపన చేశారు. రౌతు అచ్యుతరావు, కనమర్లపూడి చిన్న, వరద శేషు, కోరుకొండ సుబ్బారావు, పల్లంపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాలకోడేరు: మండలంలోని బీసీ/కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకానికి 2024– 25 సంవత్సరాలకు సంబంధించి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ దీనికి సంబంధించి బీసీ, కాపు కార్పొరేషన్, కాపు కమ్యూనిటీకి సంబంధించి స్వయం ఉపాధి పథకం, జనరిక్ ఫార్మసీలు పథకానికి ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలు మంజూరు చేయుటకు అర్హులైన బీసీ, కాపు కార్పొరేషన్ లబ్ధిదారుల గుర్తింపు కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 21 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు కలిగి, ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 22 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత నకలు పత్రాలు, పాస్‌పోర్ట్ ఫొటో జత చేయాలన్నారు.

టెన్త్ పరీక్షలకు 903 మంది విద్యార్థులు

ఆకివీడు: మండలంలో పదో తరగతి పరీక్షలకు 903 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఎంఈఓ రవీంద్ర గురువారం చెప్పారు. మండలంలోని చినకాపవరం, ఆకివీడు జెడ్పీ హైస్కూల్, నారాయణ, సెంట్ ఎలోషియస్ స్కూళ్లలో 602 ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు, 301 మంది ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని, విద్యార్థులకు మంచినీటి వసతి కల్పించినట్లు ఎంఈఓ వివరించారు. సకాలంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఆయా కేంద్రాలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

వ్యర్థాలను నేరుగా డ్రెయిన్లలో కలపొద్దు


డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: హోటళ్లు, రెస్టారెంట్ల వ్యర్థాలను నేరుగా డ్రెయిన్లలో కలపొద్దని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య హెచ్చరించారు. గురువారం ఆయన పలు వార్డుల్లో పర్యటించారు. హోటళ్ల నుంచి నేరుగా డ్రెయిన్లలోకి వ్యర్థాలను వదిలేయడం వల్ల మురుగు పారుదలకు ఆటంకాలేర్పడుతున్నట్టు చెప్పారు. మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర త్రినాథ్ తదితరులు ఉన్నారు.

మందుల పంపిణీ


మందులు పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వాకర్స్ క్లబ్ సాయం అందించింది. గురువారం పట్టణం, యలమంచిలి మండలం ఊటాడ గ్రామానికి చెందిన ముగ్గురు రోగులకు రూ.15 వేలు విలువ చేసే మందులను అందించింది. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, క్లబ్ సెక్రటరీ షేక్ పీర్‌సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావు పాల్గొన్నారు.

హామీల అమలును విస్మరించిన సర్కార్


కర్రి ఏసుబాబు

నరసాపురం: ఎన్నికల హామీల అమలును కూటమి సర్కార్ పూర్తిగా గాలికొదిలేసిందని వైఎస్సార్ సీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి, మత్స్యకార నేత కర్రి ఏసుబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులతో కలెక్టరేట్ల వద్ద నిర్వహించిన యువత పోరు కార్యక్రమం విజయవంతమైందని అన్నారు. కూటమి సర్కార్‌పై ఎనిమిది నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టారని, నిద్యోగభృతి, ఉచిత బస్సు హామీ ఊసే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది మత్స్యకారులకు మత్స్యకార భరోసా అమలు చేయలేదన్నారు. మళ్లీ కొన్ని రోజుల్లో వేట నిషేధం అమల్లోకి రాబోతుందని, ఏడాదైనా మత్స్యకార భరోసా అమలు చేస్తారో లేదో కూటమి నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ సర్కార్ బీసీల సంక్షేమానికి అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు.

ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన


కూనపరెడ్డి రంగారావు

నరసాపురం రూరల్: రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన సాగుతోందని నరసాపురం మండలం వైఎస్ పాలెం గ్రామ మాజీ సర్పంచ్, నరసాపురం మండల సర్పంచ్‌ల చాంబర్ మాజీ అధ్యక్షుడు కూనపరెడ్డి రంగారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన తన నివాసంలో మాట్లాడుతూ గ్రామాల్లో పెరిగిన మద్యం, బెల్టు షాపులు, పేకాట కేంద్రాలను నియంత్రించాల్సిన అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎన్నికల హామీలను అమలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే పతనం తప్పదని హెచ్చరించారు. ప్రజా సేవలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదన్నారు. ప్రజలు మెచ్చే విధంగా పాలన చేయాలని ప్రభుత్వానికి సూచించారు.

నేడు డయాలసిస్ సెంటర్ ప్రారంభం


డయాలసిస్ సెంటర్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సుమారు రూ.కోటితో ఏర్పాటుచేసిన డయాలసిస్ సెంటర్‌ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ నాగరాణిలు శుక్రవారం ఉదయం ప్రారంభించనున్నారు. ఏరియా ఆసుపత్రి వెనుక ఉన్న ఆపరేషన్ థియేటర్ భవనంలో ఐదు బెడ్‌లతో కూడిన డయాలసిస్ సెంటర్, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం తరువాత పాలకొల్లులో ఈ సెంటర్ అందుబాటులోకి రానుందని మెడికల్ అధికారులు తెలిపారు.